క్లుప్తంగా

రైతులు అప్రమత్తంగా ఉండాలి



గునుపూడిలో రైతులకు సూచనలు చేస్తున్న ఏవో నిమ్మల శ్రీనివాస్

భీమవరం అర్బన్: మిచాంగ్ తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. మండలంలోని యనమదుర్రు, గునుపూడి గ్రామాలలో శనివారం మాసూళ్లు చేసిన రైతులకు తుపాను నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ మాసూళ్లు చేసిన రైతులు తమ ధాన్యాన్ని ఆర్‌బీకే సెంటర్ల ద్వారా విక్రయించుకోవాలన్నారు. తుపాను ప్రభావం పోయే వరకు మాసూళ్లు, కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. రవాణా సౌకర్యంలేని ప్రాంతాలలో రైతులు ధాన్యపు రాశులను బరకాలతో గట్టిగా కప్పాలన్నారు. ధాన్యపు రాశులు చుట్టూ అడుగు మేర నాలి తీస్తే వర్షపు నీరు ధాన్యపు రాశులలోకి వెళ్లదన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



బొండాడలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కాళ్ల: బొండాడ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ మన్నే వరలక్ష్మి నాగరాజు తెలిపారు. గ్రామంలో నాలుగు లక్షల మండల పరిషత్, పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు శనివారం చేపట్టారు. పనులను ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు వైఎస్సార్ సీపీ నాయకులు మన్నే శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. పీవీఎల్ నరసింహారాజు పర్యవేక్షణలో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.

అవగాహన ర్యాలీ



భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు అవగాహన ర్యాలీ దృశ్యం

భీమవరం: అర్హత కలిగిన పౌరులంతా ఓటు హక్కును నమోదుచేసుకోవాలని తహసీల్దార్ వై రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ఓటరు అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆదర్శవంతమైన ప్రజాస్వామ్యనిర్మాణంలో యువత ప్రధానమైన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ లక్ష్మీకాంతం, పి అమూల్యారావు, కాకుమాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భవన్స్ విద్యార్థులకు బంగారు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: మహారాష్ట్ర నాసిక్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించిన సీబీఎస్ఈ జాతీయ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక భారతీయ విద్యాభవన్స్ స్కూల్ విద్యార్థులు 8 గోల్డ్, 9 సిల్వర్, 4 బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్‌వీ రమాదేవి చెప్పారు. అదేవిధంగా తమ విద్యార్థులు ఇండియా కరాటే అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో తణుకులో నిర్వహించిన జిల్లాస్థాయి కరాటే పోటీల్లో 11 గోల్డ్, 8 సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పతకాలు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లు చిరంజీవి, చిన్నారావు, నాగేశ్వరరావులను శనివారం స్కూల్‌లో అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సెక్రటరీ గోటేరు కృష్ణంరాజు, సంచాలకుడు బీవీ శేషగిరిరావు, వైస్ ప్రిన్సిపాల్ దేవిపద్మ, సీకే షీలా, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఆకివీడు: దుంపగడప గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి ఈ నెల 1 నుంచి కనిపించడంలేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. రొయ్యల కంపెనీలో పనిచేస్తున్న యువతి యథావిధిగా శుక్రవారం పనికివెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకోకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా కనిపించకపోవడంతో శనివారం ఆమె తండ్రి ఫిర్యాదు చేశారని ఎస్సై వివరించారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం



భీమవరం కముజువారిపాలెంలో నిర్మించిన బీటీ రోడ్డు



భీమవరం 32వ వార్డులో నిర్మించిన సీసీ రోడ్డు



31వ వార్డులో డ్రెయిన్ నిర్మాణం

- పట్టణంలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి
- ఇప్పటికే రూ.90 కోట్ల పనుల పూర్తి
- భీమవరం అభివృద్ధికి ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ కృషి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరంలో మౌలిక వసతులే కల్పన లక్ష్యంగా ప్రభుత్వ విప్, మ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చొరవతో పట్టణంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు తదితర అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పైపులైన్లు వంటి మౌలిక వసతులు సక్రమంగా ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తున్నారు. అలాగే ప్రధాన రహదారులను సైతం బీటీ, సీసీ రోడ్లుగా మార్చుతున్నారు. గత ప్రభుత్వ పాలనలో మున్సిపల్ కౌన్సిల్ ఉండి కూడా రోడ్ల అభివృద్ధికి నోచుకోలేదు.

కౌన్సిల్ లేకపోయినా..

భీమవరం మున్సిపాలిటికి 2019 నుంచి ఎన్నికలు జరగలేదు. దాంతో పట్టణ అభివృద్ధి బాధ్యతను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తీసుకున్నారు. ఈ నాలుగున్నరేళ్ల పాటు మున్సిపల్ నిధులు, ఆర్థిక సంఘం నిధులను చక్కగా ప్రణాళిక ప్రకారం వినియోగించుకుని పట్టణంలో ప్రజలకు అవసరమైన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి పైపు లైన్ పనులు చేయించారు. ప్రతి వార్డుకు ఆయన స్వయంగా వెళ్లి అక్కడ సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరిస్తున్నారు. వేగంగా రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టడం, అంతే వేగంగా వాటిని ప్రజావినియోగంలోకి తీసుకురావడం చేస్తున్నారు.

నాలుగేళ్లలో రూ.90 కోట్ల మేర పనులు

భీమవరం పట్టణంలో మున్సిపల్ నిధులు రూ.90 కోట్లతో గడిచిన నాలుగేళ్లలో సీసీరోడ్లు, డ్రెయిన్లు, భవనాల మరమ్మతులు, పార్కుల అభివృద్ధి, వార్డుల్లో మౌలిక వసతులు ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేశారు. ప్రస్తుతం పట్టణంలో రూ.20 కోట్లతో వార్డు వార్డునా సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నారు. పూర్తయిన పనులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వెంటనే ప్రారంభించి ప్రజావినియోగంలోకి తీసుకువస్తున్నారు.

రూ.25 కోట్లు పనులకు ప్రతిపాదనలు

పట్టణంలో ప్రతి వార్డులో ప్రజల అభీష్టం మేరకు అభివృద్ధి పనులు చేయాలని ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ తాజాగా మరో రూ.25 కోట్లు పనులకు ప్రతిపాదనలు చేశారు. ఈ పనులకు సంబంధించి నిధులు మంజూరు, టెండర్లు పిలవడం వంటి ప్రక్రియకు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు.

ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



భీమవరం పట్టణాన్ని ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాము. పట్టణంలోని ప్రతి వార్డులో సీసీరోడ్లు, డ్రెయిన్లు నిర్మించాము, కొన్ని వార్డుల్లో ఆ పనులు జరుగుతున్నాయి. ప్రతి వార్డు అభివృద్ధే లక్ష్యంగా దాదాపు రూ.90 కోట్ల మేర పనులు చేయించాం. మరో రూ.20 కోట్ల నిధులతో పనులు జరుగుతున్నాయి.

– గ్రంధి శ్రీనివాస్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే

రాయల్ ఎన్‌ఫీల్డ్ న్యూ మోడల్ బైక్ విడుదల



ఆల్ న్యూ హిమాలయన్ 450 బైక్‌ను విడుదల చేస్తున్న రూరల్ సీఐ సత్యకిషోర్, ఎస్సై మోహనరావు

భీమవరం (ప్రకాశంచౌక్): రాయల్ ఎన్‌ఫీల్డ్ ఆల్ న్యూ హిమాలయాన్ 450 బైక్‌ను భీమవరం వర్మ ఆటోమోటివ్ షోరూం నందు (రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూం) శనివారం భీమవరం రూరల్ సీఐ సత్యకిషోర్, రూరల్ ఎస్సై బండి మోహనరావు మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్స్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. కంపెనీ ప్రతీ ఏడాది న్యూ మోడల్స్ మార్కెట్‌లోకి విడుదల చేయడం బాగుందన్నారు. షోరూం అధినేత వాడపల్లి మధువర్మ మాట్లాడుతూ న్యూ హిమాలయ రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ న్యూ లుక్‌తో మంచి ఫీచర్స్‌తో వచ్చిందన్నారు. ఈబైక్ యువతను ఎంతో ఆకట్టుకుంటుందన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

అధికారులకు ఎమ్మెల్యే శ్రీనివాస్ ఆదేశం



భీమవరంలో గృహ నిర్మాణ సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

భీమవరం: ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చెప్పారు. శనివారం క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణశాఖ, మున్సిపల్ అధికారులతో క్యాంప్ కార్యాలయంలో ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన విస్సాకోడేరు జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులు వేగవంతంగా ఇళ్లు నిర్మించుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేదలకు ఇళ్లస్థలాలిచ్చి ఇళ్లు నిర్మించారని అనంతరం అధికారంలోకి వచ్చిన పాలకులకు పేదల ఇళ్లు ప్రస్తావనే లేదన్నారు. తిరిగి వైఎస్ తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాకే జగనన్న కాలనీలపేరుతో ఎక్కడికక్కడ కొత్తగా ఊర్లు వెలుస్తున్నాయన్నారు. భీమవరం నియోజకవర్గంలో 12 వేలకు పైగానే పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి వారు ఇళ్లు నిర్మించుకునే విధంగా ఒకొక్క ఇంటికి రూ.1.80 లక్షలు ఉచితంగా ఇవ్వడమేగాక లబ్ధిదారుల ఇష్టం మేరకు రూ.35 వేలు బ్యాంకు రుణాలు ఇప్పించి అన్నిసౌకర్యాలతో ఇళ్లను నిర్మిస్తున్నట్లు శ్రీనివాస్ వివరించారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాలనలో పేదలకు ఒక్క ఇంటిస్థలం ఇవ్వలేదని, ఎటువంటి సంక్షేమ పథకాలు అమలుచేయలేదని, జగన్ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఇళ్లు నిర్మిస్తుంటే ఓర్వలేక అసత్యప్రచారాలు చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. విస్సాకోడేరు జగనన్న లేఅవుట్‌లో మిగిలిన భూమికి కూడా పూడిక చేస్తామన్నారు. తాడేరు, చినఅమిరం, నర్సింహపురం, కొవ్వాడ అన్నవరం, రాయలం గ్రామాల్లోని ఇళ్లు లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించామని ప్రభుత్వ విప్ శ్రీనివాస్ చెప్పారు. సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, విస్సాకోడేరు లేఅవుట్‌లో ఇళ్లు నిర్మిస్తున్న తారకరామ కన్‌స్ట్రక్షన్ చైర్మన్ పళ్ళ ఏసుబాబు, హౌసింగ్ ఏఈలు శశికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

23న ఆకివీడులో సాధికార బస్సు యాత్ర

ఆకివీడు: ఉండి నియోజకవర్గ పరిధిలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్శింహరాజు ఆధ్వర్యంలో ఈ నెల 23న సామాజిక సాధికార బస్సు యాత్ర జరగనుందని నియోజకవర్గ పార్టీ కార్యాలయం బాధ్యులు శనివారం తెలిపారు. బస్సు యాత్ర ఈ నెల 11న నిర్వహించాల్సి ఉండగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఆకివీడు నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆలయ ప్రాంగణంలో కార్తీక వనసమారాధన

కాళ్ల: కాళ్ళ మండలం, బొండాడలో వేంచేసియున్న భోగేశ్వర, జనార్ధన స్వామి వార్ల ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా అన్నసమారాధన శనివారం నిర్వహించారు. ముందుగా స్వామివార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు,శ్రీ భోగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కోట వెంకటరామ సూర్యనారాయణ(కువయ్య),జనార్ధన స్వామి ఆలయ చైర్మన్ మందపాటి రాముల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వేగేశ్న ఆంజనేయ రాజు, గ్రామపెద్దలు కట్టా సుబ్బయ్య, పెనుమత్స రంగరాజు, కందుల హనుమ, కట్ట వెంకటరావు, మన్నే సోమేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

డిజిటల్ అక్షరాస్యతకు ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.సుజాత

ఆకివీడు: డిజిటల్ అక్షరాస్యత ప్రాధాన్యత రోజు రోజుకూ పెరుగుతోందని ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ కంప్యూటర్ దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు కంప్యూటర్, సెల్ ఫోన్ల పరిజ్ఞానం అభివృద్ధి చెందిందన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థి కంప్యూటర్ విద్యపై శిక్షణ పొందాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు కంప్యూటర్ వినియోగంపై వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఓగేశ్వరరావు, అధ్యాపకులు సీహెచ్ విజయ అనిల్, జీఎస్ఎల్.పావని, జి.దయానా కమల్ ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి



ఆకివీడు సచివాలయం-2లో పథకాలు వివరిస్తున్న జామి హైమావతి, పుప్పాల పండు తదితరులు

ఆకివీడు: రాష్ట్రాభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనే కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని సచివాలయం-2లో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల మనోగతాన్ని శనివారం సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా జామి హైమావతి మాట్లాడుతూ క్యాలెండర్ ప్రకారం పథకాల లబ్ధిదారుల ఖాతాల్లో జగనన్న సొమ్ము జమ చేస్తున్నారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నారని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చైర్‌పర్సన్ చెప్పారు. వైస్ చైర్మన్ పుప్పాల పండు, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగేందుకు మళ్లీ జగన్ పాలన రావాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఎం.డీ. జక్కీ, గృహసారధి వల్లపరపు నాగలక్ష్మీ, బూత్ కన్వీనర్ గాలిబ్, నాయకులు ఆరేటి అబ్బులు, పంపన శ్రీధర్, మహిళలు పాల్గొన్నారు.

పేదలకు సొంతింటి కల నెరవేర్చిన సీఎం జగన్



గుట్టపాడులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు

భీమవరం అర్బన్: పేదలకు సొంతింటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరం మండలంలోని గూట్లపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో భాగంగా శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గూర్చి వివరించారు. ఈ సందర్భంగా పేరిచర్ల విజయ నరసింహరాజు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు పేదలకు ఒక సెంటు భూమి ఇవ్వలేదన్నారు. జన్మభూమి సభల్లో లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకుంటూ మరుసటి రోజు బుట్ట దాఖలు చేసేవారని గుర్తుచేశారు. ఎంతోమంది అద్దెంట్లో ఉంటూ వేలకు వేలు ఖర్చు పెట్టి జీవనోపాధి సాగించేవారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే రాష్ట్రవ్యాప్తంగా 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇళ్లు నిర్మించుకునే విధంగా ప్రభుత్వ ద్వారా రూ.లక్షా 80 ఇస్తూ బ్యాంకుల రుణాలు ఇచ్చే విధంగా ప్రొత్సహిస్తున్నారన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు, మండల జేఏసీ కన్వీనర్ కోమటి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తీర ప్రాంత గ్రామాల కష్టాలను దృష్టిలో పెట్టుకుని యనమదుర్రు డ్రెయిన్‌పై నిరుపయోగంగా ఉన్న వంతెనలకు అప్రోచ్‌లు నిమిత్తం రూ.36 కోట్లు మంజూరు చేయించారన్నారు. గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ. 21 కోట్లతో పైపులైన్‌లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. రిజర్వాయర్ కోసం రూ. 80 కోట్లు మంజూరు చేయించారన్నారు. తాడేరు వద్ద గునుపూడి సౌత్ డ్రెయిన్ వంతెనను రూ. 2 కోట్ల 30 లక్షలతో నిర్మించారన్నారు. 100 పడకల ఆస్పత్రికోసం రూ.16 కోట్లు విలువ చేసే 4 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బొట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొప్పర్తి సత్యనారాయణ, సర్పంచ్ ఒడుగు ముత్యాలరావు, చెలంకూరి సత్యనారాయణమూర్తి, జవ్వాది గణేష్, చెలంకూరి శివహనుమాన్, కొట్టి కుటుంబరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోతులను పట్టి ఏజెన్సీ ప్రాంతానికి తరలింపు



కోతులను ప్రత్యేక వాహనంలో తరలిస్తున్న దృశ్యం

కాళ్ల: సుమారు వారం రోజుల నుంచి కనిపించిన వారిని కరుస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న కోతిని ఎట్టకేలకు బంధించారు. కాళ్ళ మండలం బొండాడపేటలో ఒక కోతి జనసంచారంలో సంచరిస్తూ ఇళ్ల పైకప్పులు, కిటికీల గుమ్మాలపై కూర్చుని, అకస్మాత్తుగా ప్రజలపైకి దాడి చేయడం ప్రారంభించింది. ఈ దాడిలో సుమారు 10మంది గాయాల పాలయ్యారు. జనాన్ని బెంబేలెత్తిస్తున్న ఈ కోతిని పట్టుకోవడానికి సర్పంచ్, గ్రామ పెద్దలు, అధికారులు పూనుకున్నారు. నల్లజర్ల ఏజెన్సీ ప్రాంతం నుంచి ప్రత్యేక రెస్క్యూ టీమ్ వచ్చి దాని కోసం గ్రామంలో పలుచోట్ల బోనులు ఏర్పాటు చేశారు. సుమారు నాలుగు గంటలు శ్రమించి ఎట్టకేలకు కోతిని బంధించారు. దీంతో పాటు మరొక 8 కోతులు బోనులో చిక్కుకున్నాయి. వీటిని నల్లజర్ల ఏజెన్సీ ఏరియాలోని అడవుల్లోకి వదిలిపెట్టేందుకు ప్రత్యేక వాహనంలో తరలించినట్లు అధికారులు తెలిపారు. కంటిమీద కునుకు లేకుండా చేసిన కోతిని తరలించడంతో ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు.

తుఫాన్ హెచ్చరికతో రైతుల ఆందోళన

ఆకివీడు: తుఫాన్ ప్రభావం గంట గంటకూ పెరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఆకాశం మేఘావృతమై, మధ్యాహ్నం నుంచి ఈదురు గాలుల ప్రభావం పెరిగింది. ఏ క్షణంలోనైనా వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ పంటకు వాతావరణం పూర్తిగా అనుకూలించడంతో సంతోషంగా మాసూళ్లు చేపట్టే సమయానికి తుఫాన్ హెచ్చరికలతో రైతులు హడలిపోతున్నారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. తుఫాన్ ప్రభావం రెండు మూడు రోజులుండే అవకాశం ఉండటంతో చేతికి అందివచ్చిన పంట దెబ్బతిటుందని రైతులు వాపోతున్నారు. డెల్టా ప్రాంతంలో 40 వేలకు పైగా ఎకరాల పంట కోతకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే వేలాది ఎకరాల్లో వరి మాసూళ్లు పూర్తయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో పంట పనలపై ఉండగా, మరి కొన్నిచోట్ల యంత్రాలతో కోసిన ధాన్యం పట్టుబడికి సిద్ధంగా ఉంది. కోతకు వచ్చిన పంటను మాసూళ్లు చేయవద్దని, తుఫాన్ ప్రభావం నుంచి బయట పడే వరకూ రైతులు కోతలకు వెళ్లవద్దని వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు తెలియజేస్తున్నారు.

ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి



మండల పరిషత్ సర్వసభ్య సమావేశ దృశ్యం

వీరవాసరం: వీరవాసరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ మండల పరిషత్ పురోభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ కనబరచడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలపై అధికారులు తక్షణం స్పందించాలని కోరారు. పలు గ్రామాల్లోని సీసీ రహదారుల నిర్మాణానికి తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, జెడ్పీటీసీ గుండా జైప్రకాష్ నాయుడు, ఎంపీడీవో జ్యోతి, తహసీల్దార్ సుందర్రాజు, గూడూరి ఓంకారం, అడ్డాల శ్రీరామ్‌చంద్రమూర్తి, గెడ్డం భారతి, బోను జ్యోష్ణ దేవి, నాగరాజు పద్మకల, వీరవల్లి కనక ఉషారాణి, పంజా మంగతాయారు, గుల్లిపల్లి విజయలక్ష్మి, కడలి నెహ్రూ, సైదు శ్రీనివాస్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఓటు నమోదు కేంద్రాల పరిశీలన

ఉండి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో మండలంలో అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాలను శనివారం నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి,జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు యండగండి, ఉణుదుర్రు గ్రామాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఉణుదుర్రులో బూత్‌లెవెల్ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వారికి నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న సాధారణ ఎన్నికలకు ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం ఉందన్నారు. దానిని ఓటర్లంతా పరిశీలించి మార్పు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొత్తగా ఓటరుగా నమోదుకు ఆదివారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ వై శ్రీనివాస్ చెరుకువాడ, అర్తమూరు తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న శిబిరాలను పరిశీలించారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ పూజలు



ఉప్పులూరు హనుమద్ లక్ష్మణ సీతారామచంద్రస్వామి ఆలయ పునః ప్రతిష్ఠలో పాల్గొన్న పీవీఎల్

ఉండి: ఉప్పులూరులో వేంచేసియున్న హనుమద్ లక్ష్మణ సీతారామచంద్రస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ మర్యాదల చొప్పున పీవీఎల్‌కు నిర్వాహకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్, వైఎస్సార్ సీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు కుంచాడ వెంకటేశ్వరరావు, దేవాలయ చైర్మన్ యర్రా వెంకటసుబ్బారావు, ఏఎంసీ డైరెక్టర్ నిమ్మల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

భీమవరం: బాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను శనివారం తెలిపారు. పట్టణంలోని మెంటేవారితోటకు చెందిన బాలిక పట్ల గత నెల 27వ తేదీన పట్టణానికి చెందిన పి గణపతి, ప్రసాద్ అసభ్యకరంగా ప్రవర్తించారని బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు.